www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 20 సెప్టెంబరు 2025
5
పశ్చిమ గోదావరి




మొగల్తూరులో వర్షం

మొగల్తూరు : వాతావరణ మార్పులతో మండలంలోని గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. గత రెండు రోజులుగా అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో ఎండ వేడితో ప్రజలు అల్లాడారు. కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. దీంతో ఎండ వేడి నుండి ప్రజలు ఉపశమనం పొందారు. మండలంలోని గ్రామాల్లో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో కురిసిన వర్షపు నీరు రహదారులపైనే నిలిచిపోయింది. దీంతో ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


కురుస్తున్న వర్షం

'మెడికల్' రాజకీయం..!

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వైసిపి, కూటమి పార్టీలు
మెడికల్ కాలేజీల నిర్మాణంపై పోటాపోటీగా ధర్నాలు
జగన్ హయాంలో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సెల్ఫ్ ఫైనాన్స్ విధానం అమల్లోకి
43 శాతం సీట్లకు రూ.12 లక్షలు, రూ.20 లక్షల ఫీజులు
ఏలూరు మెడికల్ కాలేజీనే అందుకు ప్రత్యక్ష నిదర్శనం
మెడికల్ కాలేజీల్లో పిపిపి విధానానికి కూటమి ప్రభుత్వం సన్నద్ధం
వైసిపి, కూటమి తెచ్చిన రెండు విధానాలు తీవ్ర నష్టమే.. అయినా బుకాయింపు


వైద్య కళాశాలను చూపుతున్న ఎంఎల్ఎ, నేతలు


ఆందోళన చేస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణంపై కూటమి, వైసిపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. గతంలో వైసిపి ప్రభుత్వం, ఇప్పుడు కూటమి సర్కార్ తెచ్చిన రెండు విధానాలూ ప్రజలకు ఏమాత్రం ప్రయోజనకరం కాదు. అయినప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టించేలా తాము చేసిందే గొప్ప అంటూ రెండు పార్టీల నేతలు పోటాపోటీగా ధర్నాలు నిర్వహించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. వైసిపి హయాంలో నిర్మించిన ఏలూరు మెడికల్ కాలేజీ వేదికగా ఈ రెండు పార్టీల నేతలు చేస్తున్న హడావుడి చూసి అంతా విస్తుపోతున్నారు. సామాన్యుల పిల్లలు మెరిట్‌లో ఎంబిబిఎస్ సీటు సాధించినప్పటికీ ఫీజులు కట్టే విధానం ఏవిధంగా మంచిదవుతుందో వైసిపి, కూటమి నేతలు చెప్పాల్సి ఉంది. మెడికల్ కాలేజీలపై వైసిపి తెచ్చిన విధానం, కూటమి ప్రభుత్వం అవలంభించబోతున్న తీరు ఒకసారి పరిశీలిస్తే అసలు విషయం తేటతెల్లమవుతోంది. వైసిపి, కూటమి పార్టీలు వైద్యవిద్యను ఏవిధంగా నాశనం చేసేందుకు తెగబడ్డాయో అర్థమవుతోంది.

వైసిపి తెచ్చిన విధానంతో 42 శాతం సీట్లకు ఫీజు వసూలు

2019-24 మధ్య వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను నిర్మించింది. వీటిలో ఏలూరు మెడికల్ కాలేజీ ఒకటి. ఈ కాలేజీకి 150 సీట్లు కేటాయించారు. గతంలో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఆలిండియా కోటా 15 శాతం, స్టేట్ కోటా కింద 85 శాతం సీట్లను భర్తీ చేసేవారు. నామమాత్రపు ఫీజు రూ.15 వేలు మాత్రమే వసూలు జరిగేది. వైసిపి ప్రభుత్వం తెచ్చిన విధానంలో ఆలిండియా కోటా 15 శాతం, స్టేట్‌కోటా కింద 42 శాతం సీట్లు మొత్తం 57 శాతం ఎంబిబిఎస్ సీట్లను మాత్రమే నామమాత్రపు ఫీజు రూ.15 వేలతో భర్తీ చేశారు. మిగిలిన 43 శాతం సీట్లను అంటే 150 సీట్లలో 64 సీట్లను బి, సి కేటగిరి కింద రూ.12 లక్షలు, రూ.20 లక్షలు ఫీజు వసూలు పెట్టింది. ఏలూరు మెడికల్ కాలేజీలో ఇదే విధంగా ఫీజుల వసూలు జరుగుతోంది. మెరిట్‌లో సీటు సాధించిన విద్యార్థులు సైతం ఏడాదికి దాదాపు రూ.75 లక్షల నుంచి రూ.కోటి వరకూ ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సామాన్య కుటుంబాల పిల్లలు ఎంబిబిఎస్ సీటు సాధించినా ఇంత పెద్దమొత్తంలో ఫీజు చెల్లించలేక వైద్యవిద్యకు దూరమవుతున్నారు. వైసిపి తెచ్చిన విధానం అప్పట్లో పెద్దదుమారమే రేపింది. అయినప్పటికీ ఏమాత్రం పట్టించుకోకుండా ముందుకు సాగింది. తాము అధికారంలోకి వస్తే మెడికల్ కాలేజీల్లో వైసిపి ప్రభుత్వం తెచ్చిన ఫీజు వసూలు విధానాన్ని రద్దు చేస్తామని లోకేష్, చంద్రబాబు చెప్పారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక పిపిపి విధానం తెచ్చి సామాన్యుల పిల్లలకు పూర్తిగా వైద్యవిద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం పూనుకుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో ఫీజు వసూలుకు తెరలేపిన వైసిపి ఇప్పుడు తాము అంతా మంచి చేసినట్లు ఆందోళన చేస్తుండటం విడ్డూరంగా ఉంది.

పిపిపి విధానంలో 85 శాతం సీట్లకు ఫీజు వసూలు

చంద్రబాబు సర్కార్ 12 మెడికల్ కాలేజీలను పిపిపి విధానంలో చేపట్టేందుకు సిద్ధమైంది. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రజాసంఘాలు, ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన నెలకొంది. దీంతో పిపిపి విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై పెద్దఎత్తున చర్చ నడుస్తోంది. గుజరాత్‌లో పిపిపి విధానంలో మెడికల్ కాలేజీలు ఇప్పటికే నడుస్తున్నాయి. ఈ విధానంలో ప్రయివేటు వ్యక్తులకు ప్రభుత్వ భూములతోపాటు నిర్వహణా అనుమతులు ఇచ్చేసింది. కాలేజీల నిర్వహణ అంతా ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోనే ఉంది. ఒక కాలేజీలో 150 సీట్లు ఉంటే వాటిలో 15 శాతం ఆలిండియా కోటా కింద నామమాత్రపు ఫీజుతో సీట్లను భర్తీ చేస్తారు. మిగిలిన 85 శాతం సీట్లకు సగటు ఫీజు రూ.నాలుగు లక్షలు, బి కేటగిరిలో సీట్లకు రూ.13 లక్షలు, సి కేటగిరి సీట్లకు రూ.25 లక్షలు చొప్పున గుజరాత్ పిపిపి మోడల్ మెడికల్ కాలేజీల్లో వసూలు చేస్తున్నారు. ఇక్కడ కూడా అదేవిధానం అమలు చేసే పరిస్థితి రానుంది. మెరిట్ విద్యార్థులకు రూ.15 వేల ఫీజుతో రావాల్సిన సీట్లకు రూ.లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్న మాట. కూటమి ప్రభుత్వం తెస్తున్న పిపిపి విధానం వైసిపి ప్రభుత్వం తెచ్చిన విధానం కంటే అత్యంత దారుణంగా ఉండనుంది. ఈ రెండుపార్టీలు ఇప్పుడు మెడికల్ కాలేజీ సీట్లపై తమ విధానాలు గొప్పగా చెప్పడం విడ్డూరంగా ఉంది. ఏలూరులో వైసిపి, కూటమి నేతలు మెడికల్ కాలేజీలపై చేస్తున్న ధర్నాలు చూసి అంతా నవ్వుతున్న పరిస్థితి నెలకొంది.

రిజిస్ట్రేషన్ విధానంలో 2.0ను రద్దు చేయండి

దస్తావేజు లేఖర్ల నిరసన


తాడేపల్లిగూడెంలో ఆందోళన చేస్తున్న దస్తావేజు లేఖర్లు


నరసాపురం రిజిస్ట్రార్‌కు వినతి అందజేస్తున్న దస్తావేజు లేఖర్లు

ప్రజాశక్తి - ఉండి

రిజిస్ట్రేషన్ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2.0 విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సీనియర్ దస్తావేజు లేఖరులు మునుకోలు సింహాచలం, కొమ్మన రాఘవ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉండిలో రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద 2.0 విధానానికి నిరసనగా పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2.0 విధానానికి నిరసనగా దస్తావేజు లేఖర్లు రెండు రోజులు చేపట్టనున్న కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి లక్షల మంది దస్తావేజు లేఖరులుగా, డిటిపి ఆపరేటర్లుగా, స్టాంపు వెండర్లుగా, సహాయకులుగా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చే ఈ నూతన విధానం వల్ల ఎన్నో ఏళ్లుగా ఈ శాఖను నమ్ముకుని పనిచేసే లక్షల కుటుంబాల జీవనం అగమ్యగోచరంగా తయారై రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చే 2.0 విధానంపై పునరాలోచించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బురిడీ వీర్రాజు, కడలి జగదీష్, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రభుత్వం నూతనంగా రిజిస్ట్రేషన్ శాఖలో ప్రవేశపెట్టిన 2.0 విధానంతో కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దస్తావేజు లేఖర్ల సంఘం మొగల్తూరు శాఖ అధ్యక్ష కార్యదర్శులు కొల్లాటి వెంకటేశ్వరరావు, శీలబోయిన సత్యనారాయణ అన్నారు. రెండు రోజులు పెన్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం లేఖర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నూతన విధానంతో లేఖర్లు, కక్షిదారులు విలువైన సమయాన్ని వృథా చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కడలి త్రిమూర్తులు, పట్టాపు రాము, గుండు నాగేంద్ర, పులపర్తి నాగేశ్వరరావు, కడలి రాజశేఖర్, బొక్కా గంగాధర్, కడలి శేఖర్, తూము కృష్ణమోహన్, ముక్కు రాజబాబు, బెల్లకుడుముల రాజేష్, వాసర్ల రవికిరణ్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : రిజిస్ట్రేషన్ విధానంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటిపి విధానం రద్దు చేయాలని, కొత్తగా ప్రవేశపెట్టిన 2.0 చట్టాల్లోని లోపాలను సవరించాలని దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు బిఎస్‌వి.సుబ్బారావు తెలిపారు. దస్తావేజు లేఖర్ల సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు రెండు రోజులు పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టినట్లు సుబ్బారావు తెలిపారు. స్థానిక తాలూకాఫీస్ సెంటర్ వద్ద దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ విధానంలో ప్రభుత్వం చేపట్టిన ఓటిపి విధానాన్ని రద్దు చేసి, కక్షిదారులకు అనుకూలంగా సేవలందించాలని విజ్ఞప్తి చేశారు. తాడేపల్లిగూడెం దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు పెదగాడి సూర్యం, కార్యదర్శి ధనరాజు, దస్తావేజు లేఖరులు పాల్గొన్నారు. ప్రభుత్వ విధానం ప్రకారం రిజిస్ట్రేషన్ కొనసాగిస్తామని సబ్ రిజిస్ట్రార్ శేఖర్ తెలిపారు.

ఆకివీడు : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 2.0 విధానాన్ని వ్యతిరేకిస్తూ దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరులు నిరసన తెలిపి మాట్లాడారు. లేఖర్లు గుడిపాటి వెంకటేశ్వరరావు, తాడేపల్లి జితేంద్ర, నిమ్మల నాగేశ్వరరావు, బండారు సతీష్, తాడేపల్లి అనిల్, అంబటి రమేష్, స్టాంప్ వెండర్ చొప్పర్ల మహాదేవరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

నరసాపురం: దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్‌తో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద లేఖర్లు నిరసన తెలిపారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ జీవన్ బాబుకు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు మాట్లాడారు. కె.చింతారావు, కె.శ్రీనివాస్, వెంకటరమణ, డి.నాగరాజు, కె.గంధం, టి.సత్యనారాయణ, చిన్నారావు, త్రినాద్, రవి రామారావు, ఈశ్వర్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను నిరసిస్తూ దగ్గులూరులో వైసిపి ఆందోళన


ఆందోళన చేస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు మండలం దగ్గులూరులో తలపెట్టిన మెడికల్ కళాశాలను ప్రయివేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ నిర్మాణంలో ఉన్న ఆ మెడికల్ కాలేజీ వద్ద వైసిపి ఆధ్వర్యాన శుక్రవారం పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ మాట్లాడుతూ పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలనే సదుద్దేశంతో నాటి సిఎం జగన్ మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కొన్ని మెడికల్ కళాశాలల నిర్మాణం పూర్తయి ప్రారంభించగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. కూటమి ప్రభుత్వం తాజాగా ఆ మెడికల్ కళాశాలలను ప్రయివేటుపరం చేయడానికి పూనుకుందని విమర్శించారు. ఫలితంగా పేదలకు వైద్యం ఖరీదు కావడమే కాక, వైద్య విద్య కూడా సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందని ద్రాక్షగా మారుతుందన్నారు. వెంటనే మెడికల్ కాలేజీల పనులను ప్రభుత్వమే పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు, నేతలు చినిమిల్లి వెంకటరాయుడు, ముదునూరి మురళీకృష్ణంరాజు, చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, యడ్ల తాతాజీ, నడపన గోవిదరాజులు, కర్రా జయసరిత, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆందోళనకు సంపూర్ణ మద్దతు : ఎంఎల్‌సి గోపీమూర్తి


మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ చేస్తున్న ఆందోళనకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న రణభేరి బైక్ జాతా శుక్రవారం ఏలూరు యుటిఎఫ్ కార్యాలయం వద్ద ముగిసింది. శుక్రవారం ఉదయం ఉంగుటూరు వద్ద జిల్లాలో ప్రవేశించిన జాత నారాయణపురం, భీమడోలు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం, చింతలపూడి మీదుగా ఏలూరు చేరుకుని ఏలూరు యుటిఎఫ్ కార్యాలయం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంఎల్‌సి మాట్లాడుతూ 15న తునిలో ప్రారంభమైన జాతాలో అనేక మంది ఉపాధ్యాయులు తమ సమస్యలు చెప్పుకున్నారని, ఉపాధ్యాయులు తరగతి గదుల్లో బోధనకే పరిమితం కావాలని డిమాండ్ ముఖ్యంగా వినిపించిందని తెలిపారు. గతంలో విద్యార్థులకు పాఠాలు బోధించడమే ఉపాధ్యాయుల ముఖ్యమైన విధిగా ఉండేదని, కాలక్రమంలో రాజకీయ ప్రయోజనాల కోసం, ఇతర ప్రయోజనాల కోసం అనేక పథకాలు, కార్యక్రమాలు తెచ్చి, వాటిని అమలు చేసేందుకు సిబ్బందిని నియమించకుండా ఉపాధ్యాయులపై బలవంతంగా రుద్దుతూ ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బడుగు బలహీన వర్గాలకు చదువు అందని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పథకాలు కార్యక్రమాలు అమలు చేయడం, వాటిని ఫొటోలు తీయడం, అప్లోడ్ చేయడం మాత్రమే గాక ఉన్నత అధికారుల నుంచి అప్పటికప్పుడు వచ్చే ఆదేశాల మేరకు వాటిని ఆన్‌లైన్‌లో పంపించడంతోనే ఉపాధ్యాయుల సమయం గడిచిపోతుందన్నారు. మరోపక్క కర్మయోగి విద్యా శక్తి వంటి పథకాలతో ఉపాధ్యాయలను బోధనకు దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగుల ఉపాధ్యాయుల ఆర్థిక మూలాల మీద దెబ్బకొట్టిన నేపథ్యంలో ఆ ప్రభుత్వం నుంచి విముక్తి కోసం ఉద్యోగ ఉపాధ్యాయులంతా గత ఎన్నికల్లో ఏకపక్షంగా కూటమి ప్రభుత్వానికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ మద్దతు తెలియజేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేసిందని, తమ ప్రభుత్వం వచ్చాక మెరుగైన పిఆర్‌సి ఇవ్వడంతో పాటు ఆర్థిక బకాయిలు చెల్లిస్తామని, ఈ లోపు మధ్యంతర భతి ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి 15 నెలల గడిచినా ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని అన్నారు. యుటిఎఫ్ చేస్తున్న పోరాటానికి పిడిఎఫ్ ఎంఎల్‌సిగా తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎన్.అరుణ్‌కుమారి, బి.సుభాషిని మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించడంతోపాటు ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించి బోధ నేతర పనులు నిర్వహించడానికి నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఈనెల 25వ తేదీన గుంటూరులో జరుగుతున్న భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు జ్యోతిబసు, సుభాషిణి, చక్రవర్తి, శ్రీదేవి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా ఆలీ, ఆర్.రవికుమార్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయకర్, షరీఫ్, కాకినాడ జిల్లా అధ్యక్షులు సూరిబాబు, రవికుమార్ రుద్రాక్షి, నాయకులు చక్రవర్తి, జ్యోతిబసు, శ్రీదేవి పాల్గొన్నారు.

కమ్యూనిస్టు సిద్ధాంత కర్త సీతారాం ఏచూరి

తుది శ్వాస వరకూ కార్మిక వర్గానికి విశేష సేవలు : సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం


ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర, జిల్లా నేతలు

ప్రజాశక్తి - భీమవరం

కమ్యూనిస్టు సిద్ధాంతకర్త సీతారం ఏచూరి అని, ఆయన తుది శ్వాస వరకూ కార్మిక వర్గానికి విశేష సేవలు అందజేశారని రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం అన్నారు. భీమవరం వెంటేవారితోటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్థంతి సభ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారం ఏచూరి చిత్రపటానికి మంతెన సీతారాం, బలరాం పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి రాసిన 805 వ్యాసాలు, 85 ప్రసంగాలను, రాజకీయ తరగతుల కోసం ఆయన తయారు చేసుకున్న 17 నోట్సులను పరిశీలించి, ముద్రించి ఓ సోషలిస్టు ఆచరణ పథం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంతెన సీతారాం మాట్లాడుతూ సీతారాం ఏచూరి 1952లో సనాతన కుటుంబంలో పుట్టి కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఎంచుకుని తన తుదిశ్వాస వరకు సిపిఎంకి, కమ్యూనిస్టు ఉద్యమానికి, దేశంలోని కార్మిక వర్గానికి విశేష సేవలందించారన్నారు. సీతారాం ఏచూరి రాజ్యసభలో మాట్లాడుతూ దేశంలో బిజెపి మత విద్వేశాన్ని పెంచి ప్రజలను విడదీస్తుందని, దీన్ని విప్లవ పార్టీగా కమ్యూనిస్టులు ఊరుకోం అని అన్నారన్నారు. పార్లమెంట్‌లో అనేక విషయాల్లో చాకచక్యంగా కోడ్ చేసి సమాధానం చెప్పేవారన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థిగా ఉన్నప్పుడే ఆయన రాజకీయ పోరాట ప్రవేశం చేశారన్నారు. ఆయన జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్‌లో జాయిన్ అయ్యి 1974లో విద్యార్థి ఫెడరేషన్‌లో భాగస్వామి అయ్యారన్నారు. ఆయనకు 32 ఏళ్ల వయస్సులో 1984లో సిపిఎం కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారన్నారు. 1992లో పోలిట్‌బ్యూరోకు, 2015 ఏప్రిల్‌లో జరిగిన 21వ మహాసభలో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారన్నారు. సీతారాం ఏచూరి జీవించిన అఖరి క్షనం వరకు ప్రజా ఉద్యమాకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మేధావి అని బలరాం కొనియాడారు. పార్టీ శ్రేణులు, యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గొర్ల రామకృష్ణ, శేషపు అశ్రియ్య, ఇంజేటి శ్రీను, భీమవరం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు, బొక్కా సత్యనారాయణ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.వలి, కార్మిక వర్గం నుండి 150 మంది పాల్గొన్నారు.

ఇవిఎం గొడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్


గొడౌన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం పీపీ రోడ్డులోని స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గొడౌన్స్‌లో భద్రపర్చిన ఇవిఎం యంత్రాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి శుక్రవారం తనిఖీ చేశారు. గొడౌన్‌కు వేసిన సీళ్లను ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రతి మూడు నెలలకోసారీ ఇవిఎంలు భద్రపర్చిన గొడౌన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ గొడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట ఇన్‌ఛార్జి డిఆర్ఒ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎఒ ఎన్.వెంకటేశ్వర్లు, ఎలక్షన్ సెక్షన్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ మాగ్రాపు సన్యాసిరావు ఉన్నారు.

కాపు సంక్షేమ సేనకు జోగయ్య రాజీనామా

రాష్ట్రీయ జన సంక్షేమ సేన ఏర్పాటు

పాలకొల్లు : కాపు సంక్షేమ సేనకు మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య రాజీనామా చేసినట్లు ప్రకటించారు. తన స్వగృహంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేవలం కాపులతోనే ఉద్యమించడం వల్ల ఉపయోగం లేదని, రాష్ట్రీయ జన సంక్షేమ సేన అనే కొత్త సంస్థ అన్ని కులాలతో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సంస్థ ఏ కులాలకు వ్యతిరేకం కాదని, అన్ని కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి సాయం చేసేందుకు ఈ సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. కొత్త కమిటీలో గౌరవ సలహాదారుగా అంగర రామ్మోహన్, కోశాధికారిగా బోనం నరసయ్య, సభ్యులుగా పలువురు ఉద్యోగులు ఉంటారని వివరించారు. సమావేశంలో సంస్థ ఉపాధ్యక్షులు డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, కార్యనిర్వాహక అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ గుడాల హరిబాబు, చవ్వాకుల నరేష్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఆక్రమణలు తొలగిస్తాం : ఎన్‌హెచ్ అధికారులు

వీరవాసరం : వీరవాసరం ప్రాంతంలో జాతీయ రహదారి 165 వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని జాతీయ రహదారి అధికారులు తెలిపారు. వీరవాసరం పంచాయతీ వార్డు సభ్యుడు గుత్తుల కృష్ణారావు ఫిర్యాదు మేరకు జాతీయ రహదారి అధికారులు శుక్రవారం ఆక్రమణలను పరిశీలించారు. వీరవాసరంలో జాతీయ రహదారి స్థలానికి సంబంధించి హద్దులు గుర్తించాలని తహశీల్దార్‌ను కోరామన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి


పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్(ఎపి నిట్), యాక్సిస్ బ్యాంక్ తాడేపల్లిగూడెం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రాంగణంలోని రవీంద్ర కళా భారతి ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. స్వచ్ఛత హి సేవ, స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్, సఫాయి మిత్ర సురక్ష సివిర్ కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్ రెడ్డి ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఆరోగ్యం ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. బోధన, బోధనేతర సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. అనంతరం మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఇంపీరియల్ ఆసుపత్రి(భీమవరం) విజయశ్రీ(తాడేపల్లిగూడెం) ఆసుపత్రులకు చెందిన డాక్టర్లు శ్రావణి, దివ్య, నాగరాజు, రాహుల్, మారిశెట్టి కృష్ణతేజ, మారిశెట్టి నాగ ప్రవల్లిక బిపి, షుగర్, ఇసిజి, జనరల్, దంత, కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 220 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ కె.హిమబిందు, అసోసియేట్ డీన్ డాక్టర్ శీనివాసన్, యాక్సిస్ బ్యాంక్ తాడేపల్లిగూడెం శాఖ మేనేజర్ హేమంత్ కుమార్, సంతోష్ కుమార్, సురేష్, ప్రసాద్, ప్రవీణ్, శేఖర్, మార్కెటింగ్ డిప్యూటీ మేనేజర్ శ్రీహరి, సాస్ అసిస్టెంట్లు సంధ్యారాణి, సాయిరామ్ పాల్గొన్నారు.

25న రణభేరి బహిరంగ సభకు తరలి రావాలి

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, రామభద్రం

భీమవరం : ఈనెల 25న గుంటూరులో నిర్వహించబోయే రణభేరి భారీ బహిరంగ సభకు ఉపాధ్యాయులు తరలిరావాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుండి 19వ తేదీ వరకు నిర్వహించిన రణభేరి జాతా విజయవంతంగా ముగిసిందని పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా తునిలో ప్రారంభమైన రణభేరి జాతా 19వ తేదీ రాత్రికి ఏలూరులో ముగిసిందని తెలిపారు. ఈ జాతాలో ఉపాధ్యాయుల సమస్యలపై చాలా వినతులు రాష్ట్ర సంఘానికి వచ్చాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్థిక సంబంధ సమస్యలు, విద్యా విషయక సమస్యలపై ఉపాధ్యాయులు చాలా అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే బోధనేతర పనులు ఉపాధ్యాయులకు తగ్గించాలని కోరారు. పిఆర్‌సి, బకాయిలు తదితర సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

రేపు ప్రజాసంఘాల భవనం ప్రారంభం

సిఐటియు మండల కన్వీనర్ ధనికొండ శ్రీనివాస్

ఉండి : గణపవరం రహదారిలోని శ్రీతారం సూర్యనారాయణ మూర్తి రైతు, కార్మిక, ప్రజాసంఘాల సేవా భవనం ఈనెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అన్ని ప్రజాసంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ ధనికొండ శ్రీనివాస్, కో కన్వీనర్ చీరల శేషగిరిరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ భవనాన్ని ఉద్దరాజు రామం ఫౌండేషన్ చైర్మన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మంతెన సీతారాం, పైలంతస్వామిలో మీటింగ్ హాల్ను ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు బి.బలరాం, సెల్గాన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్.వి.గోపాలన్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు, కార్మికులు, అంగన్వాడీలు, ఆశాలు, స్కీమ్ వర్కర్లు, ఆటో యూనియన్ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు, ఐకెపి వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణానికి సహకరించిన దాతలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చలో అసెంబ్లీకి తరలిరావాలి

కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

భీమవరం : కౌలు రైతుల సమస్యలపై ఈనెల 22న చలో అసెంబ్లీకి తరలివచ్చి జయప్రదం చేయాలని కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు పిలుపునిచ్చారు. చలో అసెంబ్లీని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం కౌలు రైతులకు కరపత్రాలు పంచి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూయజమానుల సంతకంతో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం తయారు చేసిన ముసాయిదా చట్టాన్ని అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించి అమలు చేయాలని, కౌలుదారులందరికీ పంట నమోదు ఆధారంగా పెట్టుబడిసాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 22న జరిగే చలో అసెంబ్లీకి కౌలురైతులంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌలురైతులు పాలా శ్రీను, పాలా సింహాద్రి, మల్లుల పెద్దిరాజు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర విజయవంతం చేయాలి

ఎంపిడిఒ బి.కృష్ణమోహన్

ఆచంట : మండలవ్యాప్తంగా జరుగుతున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ శనివారం గ్రామపంచాయతీలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంతో పాటు స్వచ్ఛతా హి సేవాను స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ప్రజలతో ర్యాలీలు, తడి పొడి చెత్తపై అవగాహన, చెత్త కుప్పలు తొలగింపు వంటి కార్యక్రమాలు నిర్వహించి యాప్లో ఫొటోస్ అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఒ బులి సూరన్న, గ్రామీణ నీటి సరఫరా ఎఇ రాజేష్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది హాజరయ్యారు.

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం : చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో ఆరోగ్యంగా జీవించవచ్చని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు సూచించారు. శుక్రవారం స్వచ్ఛత-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక కోడే వెంకటరావు మున్సిపల్ హైస్కూల్లో హ్యాండ్ వాష్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రవి సుధాకర్, మున్సిపల్ ఇంజనీర్ వై.వెంకటరమణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.రాజు పాల్గొన్నారు.

పలుచోట్ల పొలం పిలుస్తోంది

ఆచంట : తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించడమే పిలుస్తుంది కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పాలకొల్లు సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ పి.మురళీకృష్ణ అన్నారు. వల్లూరు గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ పాల్గొని మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పొలంబడిలో భాగంగా రైతులతో పొలం పరిసరాల విశ్లేషణ, భాగస్వామ్య కార్యాచరణ ప్రణాళిక చేయించారు. డ్రోన్ టెక్నాలజీ, డ్రోన్ వల్ల ఉపయోగాలను రైతులకు వివరించారు. అనంతరం కొడుగుడు, నిమ్మరసం కలిపిన ద్రావణాన్ని డ్రోన్ సహాయంతో పిచికారీ చేశారు. వల్లూరు సొసైటీ ప్రెసిడెంట్, సభ్యులు గుబ్బల పాపారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హేమ, రైతు సేవ కేంద్రం ఇన్చార్జులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పాలకొల్లు : వ్యవసాయంలో మోతాదుకు మించి ఎరువులు, పురుగుల మందులు వినియోగిస్తే పర్యావరణానికి కూడా హాని కలుగుతుందని భీమవరం ఎడిఎ శ్రీనివాసరావు అన్నారు. వేండ్ర గ్రామంలో శుక్రవారం జెపిఎ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ శ్రీనివాసరావు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు ఎరువులు, పురుగుమందులు వినియోగించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి బి.సంధ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తూకం కాటాలకు సీల్

కాళ్ల : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎలక్ట్రానిక్ కాటాలకు సీల్స్ ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ ఎ.శివమోహన్ తెలిపారు. శుక్రవారం కాళ్ల తహశీల్దార్ కార్యాలయంలో తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో రేషన్ దుకాణాల్లోని ఎలక్ట్రానిక్ కాటాలకు సీల్ వేశారు. లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ ఎ.శివమోహన్ ఆధ్వర్యంలో మండలంలోని 36 రేషన్ దుకాణాల తూకం కాటాలను పరిశీలించి, హెచ్చుతగ్గులను సరిచేసి, సీల్ వేశారు.

శ్రీలక్ష్మి హయగ్రీవా చార్యులకు సత్కారం

పెనుమంట్ర : ఉపాధ్యాయ సేవా కాలంలో విద్యార్థులను తీర్చిదిద్దడంలో హయగ్రీవా చార్యులకు సాటిలేరని పోలమూరు సొసైటీ అధ్యక్షులు కండిబోయిన శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని పోలమూరు మండల పరిషత్ మోడల్ స్కూల్ ప్రాంగణంలో స్థానిక పాఠశాల నుండి 2025 జిల్లా బెస్ట్ టీచర్ అవార్డు పొందిన వాడపల్లి శ్రీలక్ష్మి హయగ్రీవ చార్యులకు అభినందన సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు పాఠశాల హెచ్ఎం యర్రంశెట్టి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. గ్రామ సర్పంచి కాకర రాజేశ్వరావు, హైస్కూల్ హెచ్ఎం సరస్వతి, ఎపిటిఎఫ్ గౌరవ అధ్యక్షులు ఖాన్ ప్రసాద్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కెఎస్.శ్రీనివాస్, హెచ్ఎం.సుబ్బరాజు, హరి రాజా, టిడిపి మండల క్లస్టర్ కన్వీనర్ చింతపల్లి రామకృష్ణ, చింతపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయులు నీలం రామమోహన్, వెంకటేశ్వర రావు, ఎపిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి విశ్రాంత హెచ్ఎం, ప్రముఖ రచయిత యన్ఎస్.నాగేశ్వరరావు సభను నిర్వహించారు.

విద్యుత్ సంస్కరణలు అభినందనీయం : ఎంఎల్ఎ

తణుకు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో విద్యుత్ సంస్కరణలు తీసుకురావడం అభినందనీయమని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన సభను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యుత్ నూతన పాలసీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 ద్వారా సోలార్ ఎనర్జీ సామర్థ్యం పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. 2030 నాటికి రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్లో 50 శాతం సోలార్ ఎనర్జీ గ్రీన్ ఎనర్జీ ఉండే విధంగా చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడితో 7.50 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే ధ్యేయంతో ఈ పాలసీని తీసుకురావడం అభినందనీయమన్నారు. టైమ్ ఆఫ్ డే, రియల్ టైం సెటిల్మెంట్ మెకానిజంపై కొంతమంది పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఆలోచన చేస్తున్నారని, ఇందుకు సంబంధించి అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. ఎనర్జీ బ్యాంకింగ్లో కొనసాగిన నిబంధనలు, రియల్ టైం కాలంలో పంపిణీ, వినియోగంలో వ్యత్యాసాలు వల్ల, పీక్ అవర్ విద్యుత్ వినియోగానికి అభ్యంతరాలు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు తీసుకుని పరిశ్రమల అభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఈ పాలసీని మార్పులు తీసుకురావాలని ఈ సందర్భంగా ఎంఎల్ఎ రాధాకృష్ణ కోరారు.

బాధితులకు మందులు, నిత్యావసరాలు సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

వాకర్స్ క్లబ్ పాలకొల్లు అందిస్తున్న సేవలను వార్తాపత్రికలు, సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న దూర ప్రాంతాల వారు క్లబ్ ను సంప్రదించడంతో వారికి అవసరమైన రూ.30 వేల విలువైన మందులు, నిత్యావసరాలు క్లబ్ తరపున అందజేసినట్లు క్లబ్ గవర్నర్ సుఖవాసి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం అందించారు. కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన ఇంటర్ చదువుతున్న విద్యార్థిని ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్న హాసిని అనే విద్యార్థినికి మందులతో పాటు తల్లిదండ్రుల ఆదాయం లేకపోవడంతో నిత్యావసరాలను అందించారు. రావులపాలెంకు చెందిన 7వ తరగతి విద్యార్థి హేమంత్ టైప్-1 మధుమేహ వ్యాధితో బాధపడుతున్నాడు. అతనికి ఇన్సులిన్ మందులు అందించారు. పాలకొల్లు పెదపేటకు చెందిన నేతల ఎస్తేరు రాణి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతుండటంతో ఆమెకు మందులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, సలాది రామచంద్రరావు పాల్గొన్నారు.


మహిళలకు ఆరోగ్యంపై అవగాహన

గణపవరం : గణపవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యాన శుక్రవారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లిలో మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు పి.కిరణ్మయి, కె.ఓంకార్నాద్ మాట్లాడుతూ నెలరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పరిధిలోని గ్రామ ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కేన్సర్ స్కానింగ్, ప్రసూతి రక్షణ, తల్లీబిడ్డల సంరక్షణ, రక్తహీనత, క్షయవ్యాధి, అధిక రక్తపోటు, నోటి కేన్సర్ వంటి వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం 102 మందికి వైద్యపరీక్షలు చేసి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మద్దాల రత్నకుమారి, మధుసూదనరావు, సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు పాల్గొన్నారు.

పాలకొల్లురూరల్ : మహిళలు వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు పొత్తూరి కుమారస్వామి రాజు అన్నారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అర్ధకట్ల సచివాలయం వద్ద ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ నవ్య జీవన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 120 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. జిల్లా డిపిఎంఒ సిహెచ్.ధనలక్ష్మి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్య జీవన్ పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మండల మహాసభలో వ్యకాస మండల అధ్యక్షులు ఆశ్రియ్య



మాట్లాడుతున్న ఆశ్రియ్య

పాలకోడేరు : వ్యవసాయ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషాపు ఆశ్రియ్య డిమాండ్ చేశారు. పాలకోడేరులో వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ శుక్రవారం నాయకులు వెంకట రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రియ్య మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించి రూ.600 వేతనం అందించాలన్నారు. వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం పనిచేస్తుందని చెప్పారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పాల లక్ష్మి, కార్యదర్శిగా తమ్మినేని వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా దొంగ నాగరాజు, పైడమ్మ, సహాయ కార్యదర్శులుగా దుర్గారావుతో పాటు మరో ఐదుగురితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉపాధి కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలి

600 రోజులు పని కల్పించాలి : వ్యకాస


జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

పోడూరు : ఉపాధి హామీ కార్మికుల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోడూరు కొత్తపేటలో శుక్రవారం వ్యవసాయ కార్మికసంఘం మండల మహాసభ తరపట్ల పద్మ అధ్యక్షతన జరిగింది. ముందుగా వ్యవసాయ కార్మిక సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా జార్జి పాల్గొని మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈసభలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మూడే మోజేష్ మూడు సంవత్సరాల కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెట్టారు. ఈసభలో సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి ప్రసాద్, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి బొంతు శ్రీను, కెవిపిఎస్ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు బురాబత్తుల వెంకట్రావు కలిసి మాట్లాడారు. అనంతరం కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తరపట్ల పద్మ, కార్యదర్శిగా మూడే మోజేష్, మరో ఐదుగురుతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విప్పర్తి చంద్రకళ, తులా సత్యనారాయణ, పల్లి సూర్యనారాయణ, గంగాచలం పాల్గొన్నారు.

పన్నులు చెల్లించని కుళాయిల తొలగింపు

నరసాపురం : పట్టణ పరిధిలో ఇంటి పన్నులు, కుళాయి ఛార్జీల వసూళ్లలో భాగంగా పన్నులు చెల్లించని కుళాయిలు తొలగించు ప్రక్రియ మొదలైంది. శుక్రవారం 9వ వార్డులో బకాయి చెల్లించని కుళాయి కనెక్షన్లను తొలగించారు. ఆస్తిపన్ను చెల్లింపుదారులు వారు చెలించవలసిన ఇంటి పన్నులు, కుళాయి ఛార్జీలు వెంటనే స్థానిక వార్డు సచివాలయ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయంలో చెల్లించి రసీదు పొందవలసిందిగా కమిషనర్ ఎం.అంజయ్య కోరారు.

ఉద్యోగాలు సాధించిన వారికి సత్కారం

ఉండి : ఇటీవల విడుదల చేసిన మెగా డిఎస్సి-2025లో స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు సాధించిన బెహరా శంకరావు, వెంపటాపు జ్ఞానేశ్వరి, గొంతిన త్రివేణి, శివాల నాగేంద్ర, వర్ధనపు నిస్సీ జాన్సీ, కణితి శ్రీలేఖలను ఉండి డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు ఆధ్వర్యాన కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, సీనియర్ నాయకులు ముదునూరి కృష్ణంరాజు, కాగిత మహంకాళీ, కందుల బలరాం, ఎఎంసి వైస్ ఛైర్మన్ యడవిల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మెగా డిఎస్సి ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులు ఉత్తమ బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షులు కర్రి జయలక్ష్మి శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి పెద్దింటి నాగలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇన్ఛార్జి గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, ఎంపిటిసి కునుకు రమాదేవి పాల్గొన్నారు.

'పోషకాహారం అందించాలి'

పెనుమంట్ర : పిల్లలతో సహా అందరికీ సరైన పోషకాలు కలిగిన ఆహారం అందించాలని ఐసిడిఎస్ పెనుమంట్ర ప్రాజెక్ట్ అధికారి అంగర కృష్ణ కుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో విలేజ్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ డే నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులు, బాలింతలకు టిహెచ్ఆర్ పంపిణీ చేశారు. సిడిపిఒ ఎ.కృష్ణకుమారితో సూపర్వైజర్ పి.వరలక్ష్మి పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి వర్మ

భీమవరం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో పనిచేసిన కంప్యూటర్ ఆపరేటర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సాయివర్మ కోరారు. భీమవరం ఆయన కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లు తమను విధుల్లోకి తీసుకోవాలని వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ విషయాన్ని సాయి వర్మ రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన కంప్యూటర్ ఆపరేటర్లకు తగు న్యాయం చేయడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

ఎఎస్ఆర్ నగర్లో విద్యుత్ పునరుద్ధరించాలి

సిపిఎం మండల కార్యదర్శి ఆశ్రియ్య

పాలకోడేరు : పాలకోడేరు శివారు ఎఎస్ఆర్ నగర్లో విద్యుత్ను పునరుద్ధరించాలని సిపిఎం మండల కార్యదర్శి శేషపు ఆశ్రియ్య డిమాండ్ చేశారు. ఎఎస్ఆర్ నగర్లో విద్యుత్ పునరుద్ధరించాలని కోరుతూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ఎఇకి, పాలకోడేరు పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో రామారావు, వెంకటేశ్వరరావు, దుర్గారావు పాల్గొన్నారు.

గణిత దీప్తి స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

భీమవరం : పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో సిడి గ్రేడ్ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ మ్యాథమెటిక్స్ ఫోరం వారిచే తయారు చేయబడిన గణిత దీప్తి స్టడీ మెటీరియల్ను జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ స్థానిక కలెక్టరేట్లో ఆవిష్కరించారు. మెటీరియల్ వినియోగించుకుని నూరు శాతం ఫలితాలు సాధించాలన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

డాక్టర్ టి.శ్రీనివాస్

పెనుమంట్ర : వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం ఉప సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని మార్టేరు ఫారం ప్రాంగణంలో మద్రాస్ ఫెర్టిలైజర్స్ ఆధ్వర్యాన సమగ్ర ఎరువుల యాజమాన్యంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కె.బెనర్జీ, అడిషనల్ మేనేజర్, మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ ఏలూరు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా సభాధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేలా రాష్ట్రాలను ప్రోత్సహించేందుకు, వ్యవసాయ నిర్వహణలో ప్రత్యామ్నాయ పోషకాలను వినియోగించేందుకు కేంద్ర ప్రభుత్వం పిఎం ప్రణామ్ అనే కొత్త పథకాన్ని ప్రారంభించిందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరావు మాట్లాడుతూ సమగ్ర ఎరువుల వాడకం, రైతు సమస్యలపై రైతులతో ముఖాముఖి కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అందిస్తున్న వర్షానికి ముందు నవధాన్యాలు చల్లే కార్యక్రమాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవడం ద్వారా రసాయన ఎరువులపై భారం తగ్గుతుందని తెలిపారు. డాక్టర్ ఎన్.మల్లిఖార్జునరావు మాట్లాడుతూ నానో ఎరువుల వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు, మార్టేరు ఎడిఎలు, పెనుమంట్ర, పెనుగొండ, ఆచంట, యలమంచిలి, పాలకొల్లు మండలాలకు రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరివ్వండి : సిపిఎం

వీరవాసరం : ఉత్తరపాలెం గ్రామంలో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వాలని సిపిఎం విజ్ఞప్తి చేసింది. సిపిఎం శాఖా సమావేశం ఉత్తరపాలెం బిసి కమ్యూనిటీ హాల్లో కిల్లాడి సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశంలో గ్రామంలో నెలకొన్న కొన్ని సమస్యలపై చర్చించారు. సిపిఎం శాఖా కార్యదర్శి కేత జ్యోతిబసు మాట్లాడుతూ గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలని, ప్రజలు అనారోగ్యంపాలు అవుతున్నందున ఫిల్టర్ చేసిన స్వచ్ఛమైన మంచినీరు అందించాలన్నారు. గ్రామంలో పాడైపోయిన అంతర్గత సీసీ రోడ్డు వేయాలని తదితర సమస్యలపై అనేకసార్లు గ్రామ సచివాలయాల వద్ద ధర్నా చేసి పంచాయతీ వారికి మెమొరాండాలు ఇచ్చినా స్పందించకపోవడం అన్యాయమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేసిన వాగ్దానాల ప్రకారం అర్హులైన వారికి పెన్షన్లు ఇవ్వాలని, మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, గ్రామంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయని, వెంటనే వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి అత్యవసరమైన మందులు ఇవ్వాలని, అవసరమైతే గ్రామంలో మెడికల్ క్యాంప్ పెట్టాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీ వారు స్పందించి దోమలు, ఈగలు నిర్మూలనకు బ్లీచింగ్, ఇతర మందులు పిచికారీ చేయించాలన్నారు. ఉత్తరపాలెం కాలనీలో రోడ్లు వెంటనే వేయాలని, డ్రెయినేజీ సమస్యకు పరిష్కార మార్గం చూపాలని పాలకులకు విజ్ఞప్తి చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామంటూ హెచ్చరించారు. సమావేశంలో కడలి వీరన్న శెట్టి, జుత్తిగా సాంబి, యాంభ పాలకోటేశ్వరరావు పాల్గొన్నారు.

విస్తృతంగా అంగీకార్ ప్రచార అవగాహన

జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి పిచ్చయ్య

భీమవరం : అంగీకార్-2025 ప్రచార అవగాహన కార్యక్రమాన్ని జిల్లా అంతటా విస్తృతంగా నిర్వహించాలని జిల్లా గృహనిర్మాణ శాఖాధికారి జి.పిచ్చయ్య తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ 2.0లో భాగంగా అంగీకార్-2025 ప్రచార కరపత్రాన్ని జిల్లా కలెక్టరేట్లో జిల్లా అధికారి పిచ్చయ్య ఆవిష్కరించి మాట్లాడారు. పిఎంఎవై-అర్బన్ 2.0 పథకం ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా 'పిఎంఎవై దివాస్'ను ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి సెప్టెంబర్, అక్టోబర్ నెలలను హౌసింగ్ నెలలుగా జరుపుకుంటున్నాయని తెలిపారు. పిఎం ఆవాస్ మేళా-షెహ్రీ కార్యక్రమం రెండు దశల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి దశ ఈనెల 17 నుండి 27 వరకు, రెండవ దశలో 18 నుండి అక్టోబర్ 31 వరకు నిర్వహిస్తారని తెలిపారు. ప్రచార కార్యక్రమంలో పిఎంఎవై అర్బన్ 2.0 పథకం లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలను తెలియజేయడం, పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన ఉచిత విద్యుత్ పథకం ప్రయోజనాలను లబ్ధిదారులకు వివరించడం, కొత్తగా నిర్మించిన ఇళ్లలో గృహప్రవేశాలు నిర్వహించడం, ప్రజలకు వివిధ అవగాహన కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఎల్టిసిలు ఎస్.సరళ, ఎన్.శ్యామ్ కిషన్, పి.విజయ బాబు, వర్క్ ఇన్స్పెక్టర్లు ఎం.మురళీధర్, ఎం.సతీష్, ఐటి మేనేజర్ టిసిఎన్ భూషణం, ఎపిహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న త్రిమూర్తులు, సత్యనారాయణ

నరసాపురం : విఆర్ఎలకు ప్లే స్కేలు విఆర్ఒలుగా అటెండర్లు, వాచ్మెన్ ప్రమోషన్స్ ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు చేపట్టిన ధర్నాకు సిఐటియు కార్మిక సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేసింది. ఈ సందర్భంగా త్రిమూర్తులు, సత్యనారాయణ మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో గ్రామస్థాయిలో ప్రభుత్వానికి పన్నులు వసూలు చేస్తూ విపత్తులో భాగంగా ప్రజలకు అనేక సేవలందిస్తున్న విఆర్ఎలు చాలీచాలని జీతాలతో అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కనీస వేతనం రూ.28 వేలు అమలు చేయాలని, ప్లే స్కేలు ఇవ్వాలని, అర్హులైన విఆర్ఎలకు విఆర్ఒ, వాచ్మెన్, అటెండర్, డ్రైవర్ పోస్టుల ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఒడి లక్ష్మణ్, విఆర్ఎ సంఘ నాయకులు రాపాక ప్రసాద్, రామకృష్ణ, పొన్నపల్లి వంశీ, నీలం నాగ సుబ్బలక్ష్మి, నాగలక్ష్మి, బాలాజీ, వరదరాజు నరేంద్ర పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సర్పంచి

మొగల్తూరు : అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచి అడ్డాల సూరిబాబు సూచించారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి ఎం.సత్యనారాయణ పర్యవేక్షణలో సిబ్బంది శానిటేషన్ నిర్వహించారు. అంటువ్యాధుల సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పాముకాటు అవగాహన దినోత్సవ ర్యాలీ

భీమవరం : జిల్లా ఆరోగ్య వైద్య అధికారి గీతభాయ్ ఆధ్వర్యంలో స్థానిక బలుసుమూడి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ పాముకాటు అవగాహన దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్ఒ డాక్టర్ ధనలక్ష్మి పాము కరిచినప్పుడు ఏం చేయాలి, ఏమి చేయకూడదని వివరించారు. కరిచిన చోట కట్టు కట్టకూడదని, కొన్ని రకాల పాములు కళ్లలోకి విషాన్ని ఉమ్మివేయగలవు కాబట్టి కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. జిల్లా ఎపిడెమియాలోజిస్ట్ గాతల సుభాష్, బలుసుమూడి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణదుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.

షాప్ లీజు దారులు బకాయిలు చెల్లించాలి : కమిషనర్

నరసాపురం : పట్టణంలోని మున్సిపాలిటీకి సంబంధించిన మున్సిపల్ షాపింగ్ క్యాంప్లెక్స్లోని బకాయిలు ఉన్న షాప్ లీజు దారులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంప్లెక్స్ షాపు లీజుదారులను కమిషనర్ కలిసి మాట్లాడారు. షాపు లీజుదారులు సకాలంలో చెల్లించాలన్నారు. లీజు చెల్లించని పక్షంలో సదరు షాపులకు తాళం వేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ఎరువుల దుకాణాల తనిఖీ

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ సిఐ కె.సీతారాం తనిఖీ చేశారు. ప్రస్తుతం సార్వా సాగు ప్రధానమైన సందర్భంగా దుకాణాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రికార్డుల ప్రకారం స్టాకు తేడా లేవన్నారు. ఆయన వెంట ఎఒ అబ్దుల్ రహీం, సిబ్బంది ఉన్నారు.

ముందస్తు పిచికారీలు వద్దు : ఎఒ

గణపవరం : ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అందువల్ల రైతులు పురుగులు, తెగుళ్లు లేకుండా తెగుళ్ల మందు పిచికారీ చేయవద్దని మండల వ్యవసాయాధికారి ప్రసాద్ సూచించారు. శుక్రవారం వీరేశ్వరపురంలో రైతులతో ఆయన మాట్లాడారు. చుట్టుపక్కల గ్రామాల్లో దోమపోటుకు ముందస్తుగా పిచికారీ చేస్తున్నారని, అలా చేయవద్దని చెప్పారు. గ్రామ సర్పంచి రవిశంకర్, రైతులు గణపతి, రమేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం


యలమంచిలి..

ఆచంట : 132 కెవి పెనుగొండలో నూతనంగా బ్రేకర్ ఏర్పాటు చేయుట కారణంగా మండలంలోని అన్ని గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎఇ కె.మధుకుమార్ తెలిపారు.


యలమంచిలి : ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు కాజా సబ్ స్టేషన్ పరిధిలో ట్రీ కటింగ్ చేస్తున్న నేపథ్యంలో కరెంటును నిలుపుదల చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ నరసాపురం డిఇ కొల్లాబత్తుల మధుకుమార్ ఆదేశాలను జారీ చేశారు. దీంతో కలగంపూడి, బాడవ, అడవి పాలెం, కొంతేరు, గగ్గిపర్రు, కాజా వెస్ట్ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిరుపుదల చేస్తున్నట్లు యలమంచిలి ఎఇ చండీ కిరణ్ తెలిపారు. ప్రజలుసహకరించాలని ఆయన ప్రకటన విడుదల చేశారు.

ఆక్వా జోన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఆక్వా జోన్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలకు సిఫార్సు చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఆక్వా జోనైజేషన్ ప్రకటన కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. గ్రామ, మండల కమిటీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్వా జోనైజేషన్కు ప్రతిపాదించిన నివేదికలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించి మార్పులు, చేర్పులు, తిరస్కరణకు గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో 1,07,635.7 ఎకరాలలో ఆక్వా విస్తీర్ణం ఉందని, దీనికి అదనంగా 24,927.16 ఎకరాల విస్తీర్ణాన్ని ఆక్వా జోనైజేషన్ సర్వే ద్వారా గుర్తించడం జరిగిందన్నారు. ఇప్పుడు ప్రస్తుతం జిల్లాలో 1,32,562.9 ఎకరాల ఆక్వా సాగు విస్తీర్ణం ఉందని తెలిపారు. ప్రస్తుతం చేపట్టిన ఆక్వా జోనైజేషన్ సర్వేలో 24,927.16 ఎకరాలను, దీనికి అదనంగా సాగుకు పనికిరాని, లోతట్టు ప్రాంతంలో ఉన్న, నీటి ముంపు గురవుతున్న సాగు భూములలోని 6,379.97 ఎకరాలను ఆక్వా జోనైజేషన్ సర్వేలో గుర్తించడం జరిగిందని తెలిపారు. సర్వేలో గుర్తించిన మొత్తం 31,307.13 ఎకరాల విస్తీర్ణాన్ని ఆక్వా జోనైజేషన్ గా ప్రకటించడానికి జిల్లావ్యాప్తంగా 250 గ్రామ సభలను ఏర్పాటుచేసి ఆమోదించడం జరిగిందన్నారు. గ్రామ, మండల కమిటీల ప్రతిపాదనలను, గ్రామసభల ఆమోదంతో జిల్లా కమిటీ ముందు ఉంచిన 31,307.14 ఎకరాల విస్తీర్ణాన్ని జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమోదిస్తూ ప్రకటించడం జరిగిందన్నారు. కమిటీ కన్వీనర్, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ ఎ.నాగరాజు, ఎల్ఎల్ఎన్.రాజు, సిహెచ్.రాంబాబు, ఎన్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గుండెపోటుతో సర్పంచి గంగారత్నం మృతి



పాలకొల్లురూరల్: మండలంలోని ఆగర్రు గ్రామ పంచాయతీ సర్పంచి శాక గంగారత్నం(56) శుక్రవారం తెల్లవారుజామున గుండె పోటుతో మృ తిచెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈమెకు భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులు గల్ఫ్లో ఉండగా మరో కుమారుడు ప్రయివేట్ స్కూల్లో టీచర్గా పనిచేస్తున్నారు. సర్పంచి మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. సర్పంచి మృతి పట్ల మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్సి అంగర రామ్మోహన్ రావు, వైసిపి ఇన్ఛార్జి గుడాల గోపి సంతాపం వ్యక్తంచేశారు.